https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్

ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 61 శుక్రవారం 3-07-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# సవాలు చేసుడే కాదు..
# కట్టుబడాలి

## తెలంగాణ భవన్‌కు వెళ్తానని అంటే.. వెళ్లాల్సింది

**గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నేతలు వచ్చేదాకా వేచి ఉండాల్సింది**

**బీఆర్ఎస్‌ను ఇరకాటంలో పెట్టే అవకాశం వదులుకున్నారు**

**ప్రతిపక్షం వద్ద అంశాలే లేవు**

**కొత్త సమస్యలు సృష్టించొద్దు**

**మూసీ తొలిదశ పూర్తి చేశాకే ఎన్నికలకు: మంత్రులతో సీఎం**



**హైదరాబాద్, జూలై 2**

'సవాలు చేస్తే కట్టుబడండి. తెలంగాణ భవన్‌కు వస్తానని సవాలు విసిరి ఎందుకెళ్లలేదు? అక్కడికి వెళ్లకుండా సీఎల్పీలోనే ఎందుకున్నారు?" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక మంత్రిని ప్రశ్నించినట్టు సమాచారం. "మనం బహిరంగ చర్చలేవైనా ప్రెస్ క్లబ్ వేదికగా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. కానీ కొందరు మంత్రులు గన్‌పార్క్‌కు వెళ్లారు. అక్కడ రెండు గంటల పాటు ఉన్నా.. ఆ తర్వాత వెళ్లిపోయారు. బీఆర్ఎస్ నేతలు వచ్చేదాకా వేచి ఉండాల్సింది. బహిరంగంగా చర్చించి, వాస్తవాలు చెప్పి... ప్రతిపక్షాన్ని ఆత్మరక్షణలోకి నెట్టేసే అవకాశాన్ని వదులుకున్నారు. అసలు ప్రతిపక్ష పార్టీల వద్ద లేవనెత్తేందుకు, చర్చించేందుకు సరైన అంశాలే లేవు. వాళ్లకు మీరే పని కల్పించొద్దు" అని చురకలంటించినట్టు తెలిసింది. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ, దానికన్నా ముందు జరిగిన తేనేటి విందు సందర్భంగా ఈ చర్చ జరిగినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలుస్తోంది. గురుకులాల టెండర్ల వ్యవహారంలో అవినీతి జరగనప్పటికీ.. జరిగినట్లుగా బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టే అవకాశాన్ని సరిగ్గా వినియోగించుకోలేకపోయారని సీఎం వ్యాఖ్యానించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. "రాష్ట్రంలో అధికారంలోకి రాగానే 60 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. విద్య, వైద్యరంగాల్లో పలు సంస్కరణలు తెచ్చాం. పేద వర్గాలందరూ తినేలా సన్న బియ్యం ఇస్తున్నాం. రికార్డుస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేశాం. రుణమాఫీ చేశాం. గృహజ్యోతి, ఉచిత బస్సు వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాం, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఆర్థికంగా ప్రతికూలతలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం, ప్రజల్లోకి వెళ్లడానికి ప్రతిపక్షాలకు అవకాశం లేకుండా చేశాం. అసలు ఆడేందుకు మైదానమే లేకుండా కట్టడి చేశాం. ఇటువంటి సమయంలో కొత్త సవాళ్లు విసరడం ద్వారా సమస్యలు సృషించొద్దు" అని సీఎం సూచించినట్టు సమాచారం. అలాగే.. మూసీ పునరుజ్జీవన పథకం తొలి దశ 2027 డిసెంబరుకల్లా పూర్తిచేసి, ఆ తర్వాతే శాసనసభ ఎన్నికలకు వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. దీనికోసం మంత్రులంతా తమ వంతు పాత్రను పోషించాలని సూచించారు. రానున్న ఎన్నికల నినాదంలో మూసీ తొలిదశ పూర్తి కూడా ప్రచారవ్యూహంగా ఉండాలని గుర్తు చేశారు. కాగా.. క్యాబినెట్ భేటీకి ఒక మహిళా మంత్రి గైర్హాజరయ్యారు. కాలు బెణకడం వల్లే హాజరుకాలేదని ఆమె ప్రకటించినప్పటికీ.. ఇటీవలే ప్రకటించిన యాదాద్రి ఆలయ పాలకమండలి విషయంలో ఆమె నారాజ్‌గా ఉన్నారని సమాచారం. పాలకమండలి ప్రకటించేముందు కనీస సమాచారం తనకు ఇవ్వలేదంటూ ఆమె తన సన్నిహితుల వద్ద వాపోయారని తెలుస్తోంది. పాలకమండలి నిర్ణయం సీఎం స్థాయి వ్యవహారమేనని.. అయితే గౌరవప్రదంగా ఒక మాటగా సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేదని ఆమె సన్నిహితుల వద్ద అన్నట్లు తెలిసింది.

# వీబీ జీ రామ్‌జీకి ఆమోదం

**కానీ.. రాష్ట్ర హక్కుల పరిరక్షణకు న్యాయ పోరాటం**

**కేంద్రం ఒంటెత్తు పోకడతో దీనిని తీసుకొచ్చింది**

**గత్యంతరం లేక, కూలీలకు ఉపాధి కల్పించే యోచనతో**

**రాష్ట్రంలోనూ వీబీ జీరామ్‌జీ అమలుకు నోటిఫికేషన్**

**టీచర్లు, లెక్చరర్లు, సిబ్బందికీ మధ్యాహ్న భోజనం, అల్పాహారం**

**టిమ్స్, వరంగల్ ఆస్పత్రులకు 6,278 పోస్టుల మంజూరు**

**సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో నిర్ణయం**




**హైదరాబాద్, జూలై 2**

యూపీఏ ప్రభుత్వం అప్పట్లో ప్రవేశపెట్టిన 'మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' స్థానంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్(వీబీజీ–రామ్‌జీ)' పథకంపై సుప్రీం కోర్టు తలుపు తట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1 నుంచి అమల్లోకి తెచ్చిన ఈ పథకాన్ని రాష్ట్రంలోనూ అమలు చేయడానికి నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయిస్తూనే.. న్యాయపరంగా పోరాడాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి సుదీర్ఘంగా సాగిన క్యాబినెట్ భేటీలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం.. క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి మంత్రులు పొంగులేటి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్.. మీడియాకు వెల్లడించారు. గతంలో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కూలీలకు ఉపాధి భద్రత కల్పించాలన్న ఉద్దేశంతో, అన్ని రాష్ట్రాలూ ఆమోదించేలా దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పథకాన్ని తీసుకొస్తే.. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు, పేదవాళ్లు, కూలీల అభిప్రాయాలకు భిన్నంగా ఆ పథకం పేరును 'వీబీజీ–రామ్‌జీ'గా మార్చి.. ఎవరెన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా ఒంటెత్తు పోకడతో ఈ నెల 1 నుంచి అమలు చేస్తోందన్నారు. పేదల హక్కులను హరించే విధంగా తీసుకొచ్చిన ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రప్రభుత్వం ఈ ఏడాది జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపించిందని.. 'ఉపాధి హామీ' పథకంలో మార్పులు చేయొద్దని కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. అయినప్పటికీ.. ఒక్క లైను, ఫుల్ స్టాప్, ఒక్క కామా కూడా మార్చకుండా కేంద్రం 'వీబీజీ–రామ్‌జీ' పథకాన్ని అమల్లోకి తెచ్చిందని ధ్వజమెత్తారు. ఈ చట్టంలో పొందుపర్చిన నిబంధనలపై మంత్రివర్గం నిరసన తెలిపిందని.. దీనిపై అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్ అధ్యక్షతన ఒక క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

మిగతా 2లో...

## చందాదారులకు ఈపీఎఫ్‌వో శుభవార్త! 2




నెలవారీ చందాను నిర్ణయించుకొనే చాన్స్

## ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కారు 2

సర్కారు నిర్ణయాలను వ్యతిరేకించే హక్కు వారికి ఉంది

నిరసన కార్యక్రమాలూ చేపట్టొచ్చు

అది రాజ్యాంగం కల్పించిన హక్కు

ఈ విషయంలో పౌరుల నగర బహిష్కరణ చెల్లదు

బాంబే హైకోర్టు ఆదేశాలు

పోలీసులు ముఖ్యమంత్రి, ప్రధానికి సేవకులు కాదని వ్యాఖ్య

## ఏఐతో జాగ్రత్త! 2

కోర్టులు, లాయర్లకు సుప్రీం హెచ్చరిక

కోర్టులకు, లాయర్లకు సుప్రీంకోర్టు హెచ్చరిక

ఏఐ పేర్కొనే 'గత తీర్పు'లను తీర్పుల్లో, వాదనల్లో ప్రస్తావించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచన

# అమరావతిని ఆపలేరు

**అది ఎవరి తరమూ కాదు**

**గొడ్డలి పార్టీది రోజుకో మాట: చంద్రబాబు**

**అసెంబ్లీ సాక్షిగా అమరావతికి నాడు మద్దతు**

**అధికారంలోకి వచ్చి మూడు రాజధానులన్నారు**

**ఇప్పుడు మావిగన్ పాటపాడుతున్నారు**

**వీబీ-జీరామ్‌జీ పథకంతో.. గ్రామాల రూపురేఖలు మారుస్తాం!**


**రూ.11,700 కోట్లతో ఉపాధి పనులు**

**రూ.లక్ష కోట్లతో హార్టీకల్చర్ హబ్‌గా సీమ**

**ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక**

**తిరుపతి జిల్లా ముక్కావారిపల్లె వద్ద వీబీ-జీ రామ్‌జీ స్కీంకు శ్రీకారం**

**కేంద్ర మంత్రి చౌహాన్, డిప్యూటీ సీఎంతో కలిసి ప్రారంభించిన చంద్రబాబు**



**తిరుపతి/రైల్వేకోడూరు, జూలై 2**

రాజధాని అమరావతిని ఆపడం ఎవరి తరమూ కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చిచెప్పారు. రాజధానిలో నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని.. అయితే గొడ్డలి పార్టీ రోజుకో మాట మాట్లాడుతూ అభివృద్ధికి అడ్డు తగులుతోందని ధ్వజమెత్తారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా అమరావతికి అనుకూలంగా మాట్లాడిన జగన్.. అధికారంలోకి వచ్చాక మూడు రాజధానులని మాట మార్చారని.. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పాట పాడుతున్నారని మండిపడ్డారు. 'వికసిత్ భారత్–గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్).. వీబీ–జీరామ్‌జీ' పథకంతో రాష్ట్రంలో గ్రామాల రూపురేఖలు మారుస్తామన్నారు. తిరుపతి జిల్లా ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె వద్ద ఈ పథకాన్ని కేంద్ర వ్యవసాయం–రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. కొత్త ఉపాధి పథకం కింద కేంద్రం నుంచి రూ.7700 కోట్లు, రాష్ట్రం వాటా కింద మరో రూ.4 వేల కోట్లతో పనులు చేపడతామన్నారు.

మిగతా 2లో...

# 2, 3 నెలల తర్వాతే
# పెట్రో ధరల తగ్గింపు

**అదీ ముడిచమురు ధరలు ఇదే స్థాయిలో కొనసాగితేనే..**

**కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురి**



న్యూఢిల్లీ, జూలై 2: అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించే పరిస్థితి లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి స్పష్టం చేశారు. కనీసం మరో 2, 3 నెలల పాటు ముడిచమురు ధరలు ఇదేస్థాయిలో కొనసాగితేనే ధరల తగ్గింపుపై పునఃసమీక్షించే అవకాశం ఉందన్నారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత రిఫైనరీలు రెండు నెలల క్రితం అధిక ధరలకు కొనుగోలు చేసిన చమురునే శుద్ధి చేస్తున్నాయని చెప్పారు. "తగ్గిన ప్రస్తుత ముడిచమురు ధరలు మరో 2, 3 నెలలు ఇలాగే కొనసాగితే అప్పుడు పరిస్థితిని సమీక్షిస్తాం. అయితే ధరలు తగ్గుతాయని ఇప్పుడే చెప్పడం ఊహాజనితమే అవుతుంది" అని మంత్రి అన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, దేశీయ ప్రభుత్వరంగ చమురు సంస్థలు ఆ భారాన్ని ప్రజలపై వేయలేదని తెలిపారు. దీంతో అవి జూన్ నెలాఖరు నాటికి రూ. 74,781 కోట్ల మేరకు నష్టపోయాయని వెల్లడించారు. ఈ సంక్షోభ సమయంలో పెట్రోల్ ధరలు అభివృద్ధి చెందిన దేశాల్లో 20శాతం, భారత పొరుగు దేశాల్లో 35శాతం వరకు పెరిగితే.. భారత్‌లో 5.58శాతం మాత్రమే పెరిగాయని ఆయన తెలిపారు.

# భారత్-జపాన్ ఏఐ బంధం

**న్యూఢిల్లీ, జూలై 2:**

భారత్–జపాన్ ద్వైపాక్షిక బంధంలో కొత్త అధ్యాయం మొదలైంది. నేడు ప్రపంచాన్ని శాశిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ)పై కలసి కృషి చేయాలని నిర్ణయించాయి. భారత్ సాఫ్ట్‌వేర్, ఏఐ నైపుణ్యాలకు, జపాన్ తయారీ సామర్థ్యాలు తోడై ఫలితాలు సాధించాలన్న అవగాహన కుదిరింది. అంతేకాదు, ఆర్థిక, రక్షణ, ఇంధనం సహా పలు కీలక రంగాల్లో విస్తృత సహకారానికి రెండు దేశాలు అంగీకారానికి వచ్చాయి. భారత్‌లో జపాన్ కంపెనీలు మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నాయి. సెమీకండక్టర్లు, క్వాంటమ్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, కీలక ఖనిజాలు, వ్యూహాత్మక తయారీకి సంబంధించి సరఫరా వ్యవస్థల బలోపేతానికి కలసి పనిచేయాలని రెండు దేశాలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించిన సహకార, అవగాహ న ఒప్పందాలు ప్రధాని మోదీ,



జపాన్ ప్రధాని సనాయే తకాయిచి సమక్షంలో కుదిరాయి. గురువారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నిర్వహించిన భారత్–జపాన్ 16వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జపాన్ ప్రధాని తకాయిచితో కలసి ప్రధాని మోదీ మీడియాకు వివరాలు వెల్లడించారు. "నేటి అనిశ్చిత పరిస్థితుల్లో ఆర్థిక, ఇంధన భద్రత ప్రాముఖ్యాన్ని భారత్, జపాన్ పూర్తిగా అర్థం చేసుకున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్థిక భద్రతకు సంబంధించి సంయుక్త కార్యాచరణను సిద్ధం చేశాం"అని ప్రధాని ప్రకటించారు. గడిచిన ఏడాది కాలంలో భారత్–జపాన్ మధ్య కుదిరిన 100కు పైగా ఒప్పందాలతో 10 బిలియన్ డాలర్ల (రూ.95వేల కోట్లు) జపాన్ పెట్టుబడులు భారత్‌కు రానున్నట్టు ప్రకటించారు. వచ్చే పదేళ్లలో 10 ట్రిలియన్ జపాన్ యెన్‌ల పెట్టుబడులను (రూ.5.92 లక్షల కోట్లు సుమారు) ఆకర్షించడమే తమ లక్ష్యంగా పేర్కొన్నారు.

# వీబీ జీ రామ్‌జీకి.. (మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని మోపేలా సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగించేలా, ఏకపక్షంగా వీబీజీ–రామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని క్యాబినెట్ సబ్ కమిటీ వెల్లడించిందన్నారు. కమిటీ చేసిన పలు సిఫారసులపై మంత్రివర్గం చర్చించిందని.. ఇతర రాష్ట్రాలన్నీ ఈ కొత్త చట్టానికి ఆమోదం తెలిపాయా లేదా అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకుందని వెల్లడించారు. అన్ని రాష్ట్రాలూ ఈ కొత్త చట్టం అమలుకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారని వివరించారు. గత్యంతరం లేని పరిస్థితిలో ఉపాధి హామీ కూలీలకు పని కల్పించే ఆలోచనతో... ఈ కొత్త చట్టాన్ని 2026 జూలై 1 నుంచి రాష్ట్రంలో అమల్లోకి తెచ్చేందుకు నోటిఫికేషన్ జారీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు.అదేసమయంలో..రాష్ట్ర హక్కులను పరిరక్షించుకోవడానికి న్యాయపరంగా పోరాటం చేయాలని, కొత్త చట్టంలో విధించిన నిబంధనలపై సుప్రీం కోర్టుకు వెళ్లాలని నిర్ణయం తీసుకుందని చెప్పారు. పార్లమెంట్‌లోనూ కేంద్రం తీరును నిలదీయాలని క్యాబినెట్ నిర్ణయించిందన్నారు.

### క్యాబినెట్ ఇతర నిర్ణయాలు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అందించే అల్పాహారం, పాలు, మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది. దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి పథకాన్ని వర్తింపజేయనుంది. కొత్తగా అందుబాటులోకి వస్తున్న టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో పెద్దఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్‌నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్‌తో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టులను మంజూరు చేసింది. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వీలుగా మొత్తం 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులకు అనుమతించారు. ఈ ఆస్పత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్)లను కూడా ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా ఫేజ్–1 పనులకు మంత్రివర్గం పరిపాలన అనుమతులను మంజూరు చేసింది. తొలి దశలో 21 కిలోమీటర్ల పొడవున అభివృద్ధికి రూ.7,345.12 కోట్ల విలువైన పనుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. హిమాయత్‌సాగర్ నుంచి ఈసీ... ఉస్మాన్‌సాగర్ నుంచి మూసీ నదుల ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపు ఘాట్ వరకూ ఈ పనులను చేపడతారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవల్‌పమెంట్ పనులు, నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టులను సృష్టించడంతో పాటు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బంది డిప్యూటేషన్‌కు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే.. ఈ ప్రాజెక్టు చేపట్టడానికి రూ.4500 కోట్ల రుణాన్ని ఆసియన్ డెవల్‌పమెంట్ బ్యాంకు నుంచి తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయించింది. 2027 డిసెంబరుకల్లా తొలిదశ పనులు పూర్తిచేయాలని నిర్ణయం తీసుకుంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి 50 ఎకరాలను, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాలను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేట్ ప్రకారం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. జవహర్ నవోదయ విద్యాలయాలకు రెండు చోట్ల ప్రభుత్వం స్థలాలను కేటాయించింది. మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని క్యాబినెట్ కేటాయించింది. అలాగే, జగిత్యాల జిల్లా చల్‌గల్ గ్రామంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని క్యాబినెట్ నిర్ణయించింది. డిస్కమ్‌లు వర్కింగ్ క్యాపిటల్ కింద పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎ?ఫసీ) నుంచి తీసుకునే రూ.9 వేల కోట్ల రుణానికి పూచీకత్తు ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించింది. పూచీకత్తు ఇవ్వడం వల్ల వడ్డీ రేట్లలో ఉపశమనం ఉంటుందని, పూచీకత్తు ఇవ్వకపోతే వడ్డీభారం ఉంటుందని అధికారులు నివేదించగా... దీనిపై చర్చించిన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సింగరేణి, రాజస్థాన్ విద్యుత్ సంస్థల మధ్య జాయింట్ వెంచర్ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ జేవీలో భాగంగా మంచిర్యాల జిల్లా జైపూర్‌లో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్‌ను సింగరేణి కట్టనుంది. దీనికి బదులుగా రాజస్థాన్‌లో 1500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ రాజస్థాన్ విద్యుత్ సంస్థ నిర్మించనుంది. జేవీలో భాగంగా ఒక కొత్త సంస్థను ఏర్పాటు చేసి, దాని మార్గదర్శకాలు సిద్ధం చేయనున్నారు. ఇక మార్క్‌ఫెడ్ ద్వారా వివిధ పంటల కొనుగోలు కోసం తీసుకునే రుణం కోసం పూచీకత్తు ఇవ్వాలని మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, ములుగు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల కోసం స్థలాలు కేటాయించాలని నిర్ణయం తీసుకుంది.

# అమరావతిని...(మొదటిపేజీ తరువాయి)

125 రోజుల పనిదినాలతో గ్రామాల అభివృద్ధికి అవసరమైన ఏ పనులైనా చేపట్టేందుకు అవకాశముందని.. రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు.. ఇలా వేర్వేరు ఆస్తుల కల్పనకు ఆస్కారముందని తెలిపారు. దీనిని రాష్ట్రం సంపూర్ణంగా సద్వినియోగం చేసుకుంటుందన్నారు. 'రియల్ టైమ్ మానిటరింగ్, జియో ట్యాగింగ్, బయోమెట్రిక్ వంటి సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తాం. కేంద్ర పథకాలన్నిటినీ నిర్వీర్యం చేసిన జగన్.. దొంగ లెక్కలు చూపి నిధులు మళ్లించేశారు. ఇక అలా జరగదు. ఇంటింటికీ తాగునీటి కొళాయినిచ్చే జలజీవన్ మిషన్ పథకాన్ని కూడా నిర్వీర్యం చేస్తే మేం రూ.28 వేల కోట్లతో మళ్లీ ప్రారంభించాం' అని గుర్తుచేశారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

### ఆ ఘనత పవన్‌దే..

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తాం. 2024 ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించిన ఘనత పవన్ కల్యాణ్‌కే దక్కింది. గ్రామీణ ప్రాంతాల్లో 48 రకాల పనులు 4500 చేపట్టి పూర్తి చేయించాం. 7 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 నీటి తొట్టెలు, 1.007 లక్షల పంటకుంటలు నిర్మించాం. గిరిజన ప్రాంతాల్లో 1376 కిలోమీటర్ల రోడ్లు వేసి వారి జీవితాల్లో పవన్ ఆనందం నింపారు. 1.66 లక్షల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాం. ఉపాధి హామీ పనుల నిమిత్తం 55.44 కోట్ల పనిదినాలు సృష్టించి.. రూ.15,695 కోట్లు ఖర్చు చేశాం. ఈ ఏడాది మరో 10 వేల కిమీ గ్రావెల్ రోడ్లు, 1500 కిమీ బీటీ రోడ్లు, 500 కిమీ మ్యాజిక్ డ్రెయిన్లు, లక్ష ఎకరాల్లో పండ్ల తోటల అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకున్నాం. పొలాలకు రోడ్లు వేసే బాధ్యతా ప్రభుత్వం తీసుకుంటోంది.

### పుష్కరాల్లోపే పోలవరం జాతికి అంకితం..

రాయలసీమను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతాం. హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తాం. దానికోసం ఈ ఏడాది రూ.40 వేల కోట్ల కేంద్ర నిధులు, రూ.60 వేల కోట్ల ప్రైవేటు నిధులు.. మొత్తం లక్ష కోట్లు పెట్టుబడిగా పెడతాం. ఈ హబ్‌కు త్వరలో మదనపల్లెలో శంకుస్థాపన చేస్తాం. సీమ తలరాతను మార్చేది ఎన్డీయే ప్రభుత్వమే. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు వస్తున్నాయి. ఆలోపే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. కేంద్ర సహకారంతో విశాఖలో స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టుకున్నాం. విశాఖ రైల్వే జోన్ కూడా సాధించుకున్నాం. ఉత్తరాంధ్రకు గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్ జెట్ తయారవుతోంది. సత్యవేడులో హీరో మోటర్ సైకిళ్ల తయారీ యూనిట్ నడుస్తోంది. బుధవారమే గ్లోబల్ పార్ట్స్ 2.0 ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశాను. ఇప్పుడు తిరుపతి జిల్లాకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటర్ సైకిల్ తయారీ ప్లాంట్ వస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి, అభివృద్ధికి కేంద్రం సహకరిస్తోంది. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రజలు సహకరించాలి.

### 'మామ'పై చంద్రబాబు ప్రశంసల జల్లు

మధ్యప్రదేశ్‌లో 'మామ'గా ప్రసిద్ధుడైన కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్‌పై సీఎం ప్రశంసల జల్లు కురిపించారు. తోతాపురి మామిడి రైతులను ఆదుకునేందుకు, రోడ్లు, పీఎంఏవై ఇళ్ల నిర్మాణానికి నిధులిచ్చారని కొనియాడారు. నాలుగు సార్లు మధ్యప్రదేశ్ సీఎంగా, ఏడుసార్లు ఎంపీగా పనిచేసిన ఆయన ఓటమి ఎరుగని నేతగా అభివర్ణించారు. 'ప్రజల మనిషి. ఏమడిగినా కాదనే తత్వం కాదు. ఆయన మనందరికీ మామ. దేశానికే మామ' అని అన్నారు. సభకు హాజరైన ప్రజలతో పలుసార్లు మామ అని అనిపించడంతో చౌహాన్ సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

### ఏమేం చేశారు..?

బహిరంగ సభ వేదికపై సీఎం, డిప్యూటీ సీఎం, చౌహాన్‌తో పాటు కేంద్ర సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేశ్ పాశ్వాన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచి వీబీ–జీరామ్‌జీ పథకం దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లయింది. అంతకుముందు బహిరంగసభ ప్రాంగణంలో పంటకుంట పనులను చంద్రబాబు, పవన్ కల్యాణ్, శివరాజ్ చౌహాన్ ప్రారంభించారు. ఏపీలో విజయవంతంగా అమలు చేస్తున్న మ్యాజిక్ డ్రెయిన్ నమూనాను పరిశీలించారు. గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి శ్రామికులకు చౌహాన్, సీఎం, డిప్యూటీ సీఎం జాబ్‌కార్డులు అందించారు. సమాచార బుక్‌లెట్, కంపెండియమ్ ఆఫ్ ఆర్టికల్స్‌ను పవన్ విడుదల చేశారు. సాఫ్ట్ పోర్టల్‌ను నేతలు ప్రారంభించారు. సభలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కడప అర్బన్ డెవల్‌పమెంట్ అథారిటీ ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# చందాదారులకు ఈపీఎఫ్‌వో శుభవార్త!

**- నెలవారీ చందాను నిర్ణయించుకొనే చాన్స్ - ఉద్యోగి కచ్చితంగా కట్టాల్సింది రూ.1,800**

**- అంతకుమించి ఎంతైనా స్వచ్ఛందంగా జమ - కంపెనీ కూడా అంతే ఇవ్వాలన్న రూల్ లేదు**

**- ఈపీఎఫ్ స్కీమ్- 2026లో కీలక మార్పులు**

**న్యూఢిల్లీ, జూలై 2:**
ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారులకు శుభవార్త. దాదాపు 8కోట్ల మంది సభ్యుల కోసం పీఎఫ్ నిబంధనలను సమూలంగా మారుస్తూ ఈపీఎ?ఫవో కీలక ప్రకటన విడుదల చేసింది. ఉద్యోగులకు తమ జీతం నుంచి ఎంత మొత్తాన్ని పీఎఫ్ కింద దాచుకోవాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛను కల్పించింది. ప్రస్తుతం నెలకు రూ.15 వేలుగా ఉన్న చట్టబద్ధమైన వేతన పరిమితి వరకు 12శాతం వాటా చెల్లించడం తప్పనిసరి. అంటే ఇప్పటి వరకూ పీఎఫ్ కింద గరిష్ఠంగా రూ.1,800 కట్ అవుతోంది. ఒకవేళ ఉద్యోగి జీతం రూ. లక్ష ఉన్నా ఈ మొత్తం కచ్చితంగా కట్టాల్సిందే. వారు పనిచేసే సంస్థ కూడా అంతే మొత్తం తన వాటా కింద చెల్లిస్తోంది. తాజాగా అమల్లోకి వచ్చిన ఉద్యోగ భవిష్య నిధి పథకం–2026 ప్రకారం.. పదవీ విరమణ నిధిని మరింత పెంచుకోవాలనుకొనే వారు ఇంతకంటే ఎక్కువ మొత్తాన్ని పీఎ?ఫలో జమ చేసుకొనే అవకాశం కల్పించారు. తమ జీతంలో పీఎఫ్ కింద ఎంత కట్ చేయాలనేది ఉద్యోగులే స్వయంగా నిర్ణయించుకోవచ్చు. ఈ అదనపు మొత్తాన్ని




స్వచ్ఛంద పీఎఫగా పరిగణిస్తారు. దీనికి సమానంగా వారు పనిచేసే సంస్థ కూడా అంతే మొత్తం తప్పనిసరిగా జమ చేయాల్సిన అవసరం లేదు. అలాగే ఈ అదనపు చందాను ఉద్యోగులు ఎప్పుడైనా తగ్గించుకోవచ్చు లేదా పూర్తిగా నిలిపివేసే అవకాశం కూడా ఉంది.

# ప్రజలు ప్రభుత్వానికి బానిసలు కారు

**సర్కారు నిర్ణయాలను వ్యతిరేకించే హక్కు వారికి ఉంది**

**నిరసన కార్యక్రమాలూ చేపట్టొచ్చు**

**అది రాజ్యాంగం కల్పించిన హక్కు**

**ఈ విషయంలో పౌరుల నగర బహిష్కరణ చెల్లదు**

**బాంబే హైకోర్టు ఆదేశాలు**

**పోలీసులు ముఖ్యమంత్రి, ప్రధానికి సేవకులు కాదని వ్యాఖ్య**




ముంబై: "దేశ పౌరులను భారత ప్రభుత్వానికి బానిసలుగా మారుస్తున్నారా? వారు నిరసన ప్రదర్శనలు చేయకూడదా? నిరసిస్తే కేసులతో వేధిస్తారా? నిరసన వ్యక్తం చేయడం పౌరుల హక్కు. పిటిషనర్ కేవలం బీజేపీ ప్రభుత్వం డౌన్ డౌన్, అమిత్‌షా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాంటి నినాదాలు ఇవ్వకూడదా? వాటికే సమాజం నుంచి వెలి వేస్తారా?" ఓ వ్యక్తి నగర బహిష్కరణ కేసులో విచారణ సందర్భంగా బాంబే హైకోర్టు చేసిన ఘాటు వ్యాఖ్యలు ఇవి. మహారాష్ట్రలోని కొంకణ్ ప్రాంతానికి చెందిన సమీద్ అహ్మద్ అబ్దుల్ వాహిద్ చౌదరి (49) సోషలిస్ట్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పౌరసత్వ సవరణ చట్టంతోపాటు జ్ఞానవాపి మసీదు వివాదం తదితర సున్నిత అంశాలకు వ్యతిరేకంగా ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో ఏడాది పాటు ఆయన్ని నగరం నుంచి బహిష్కరిస్తూ కొంకణ్ ప్రాంత డిప్యూటీ పోలీసు కమిషనర్ 2025 డిసెంబర్ 3న ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని డివిజనల్ పోలీసు కమిషనర్ కూడా 2026 మార్చి 27న సమర్థించారు. దీంతో వాహిద్ చౌదరి న్యాయం కోరుతూ బాంబే హైకోర్టు తలుపు తట్టారు. ఈ ఆదేశాలను జారీ చేసిన పోలీసులను జస్టిస్ మాధవ్ జామ్‌దార్ కడిగి పారేశారు. ప్రభుత్వ నిర్ణయాలను విభేదించినందుకు పౌరులను బహిష్కరించే హక్కు పోలీసులకు లేదని తేల్చి చెప్పారు. పోలీసులు ముఖ్యమంత్రి లేదా ప్రధాన మంత్రి సేవకులు కాదని, వారు ప్రజా సేవకులని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో ప్రస్తుతం రాజకీయ బేరసారాలు నడుస్తున్నాయంటూ.. ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీలను మారుస్తుంటే వారిపై ఏమైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారా? అని పోలీసులను నిలదీశారు. పౌరులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడమే కాకుండా, గౌరవంగా జీవించే హక్కుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21 హామీ ఇస్తున్నాయని స్పష్టం చేస్తూ వాహిద్ చౌదరిపై బహిష్కరణ ఆదేశాలను న్యాయమూర్తి కొట్టివేశారు.

# ఏఐతో జాగ్రత్త!

## కోర్టులు, లాయర్లకు సుప్రీం హెచ్చరిక

**కోర్టులకు, లాయర్లకు సుప్రీంకోర్టు హెచ్చరిక**

**ఏఐ పేర్కొనే 'గత తీర్పు'లను తీర్పుల్లో, వాదనల్లో ప్రస్తావించే ముందు ధ్రువీకరించుకోవాలని సూచన**



న్యూఢిల్లీ, జూలై 2: ఏఐ (కృత్రిమమేధ) వినియోగంపై న్యాయమూర్తులు, న్యాయవాదులు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏఐ పేర్కొనే 'గత తీర్పులను' ఉదహరించేముందు వాటిని కచ్చితంగా సరిచూసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏఐ సృష్టించే నకిలీ, ఊహాజనిత, ఉనికిలోలేని తీర్పులను ఎంతమాత్రం ఉపేక్షించవద్దని పేర్కొంది. ఈ మేరకు ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ కంపెనీ దివాలా కేసులో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధెలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ కేసుపై విచారణ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఏఐ సృష్టించే నకిలీ, ఊహాజనిత వివరాలను 'కోర్టులు ఇచ్చిన గత తీర్పులు'గా పేర్కొనటం అంటే న్యాయవ్యవస్థ మీదికి మిథైల్ ఐసోసైనేట్ (భోపాల్ ప్రమాదంలో వెలువడిన విషవాయువు)ను వదలటమే. అది న్యాయవ్యవస్థను కలుషితం చేయటమేకాదు, దాంట్లోని జీవాన్నే హరించివేస్తుంది' అని హెచ్చరించింది. ఏఐ సృష్టించే 'గత తీర్పులను' ధ్రువీకరించుకోకుండా తీర్పుల్లోగానీ, వాదనల్లోగానీ ప్రస్తావించకూడదని, అటువంటి వాటి పట్ల ఎంతమాత్రం సహించని వైఖరిని కలిగి ఉండాలని కోర్టులకు, న్యాయవాదులకు సూచించింది. ఏఐ సృష్టించే నకిలీ, ఊహాజనిత వివరాలను ఉదాహరణగా పేర్కొంటూ ఇచ్చే తీర్పులు తీర్పులే కావని ప్రకటించింది. ఏఐ సృష్టించే నకిలీ తీర్పులపై తీవ్రంగా స్పందించిన ధర్మాసనం. ఏఐ సక్రమ వినియోగంపై సానుకూలత వ్యక్తం చేసింది. కాగా, ఎస్సెల్ ఇన్‌ఫ్రా దివాలా కేసులో తీర్పునిస్తూ.. ఆ నిర్ణయానికి మద్దతుగా ఎన్‌సీఎల్‌టీ ఉదహరించిన పలు 'గత తీర్పు లు' అసలు లేనే లేవని సుప్రీంకోర్టు గుర్తించింది.

## విజయ్ ప్రభుత్వం కూల్చివేత కుట్ర కేసులో మరో నలుగురి అరెస్టు

**చెన్నై, జూలై 2** తమిళనాట టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు భారీగా బేరసారాలు జరిపారనే ఆరోపణలపై నమోదైన కేసులో గురువారం మరో నలుగురు అరెస్టయ్యారు. దీంతో ఈ కేసులో అరెస్టయినవారి సంఖ్య 9కి పెరిగింది. ఈ కేసులో డీఎంకే మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ, ఆయన సోదరుడు అశోక్‌కుమార్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇటీవల శాసనసభలో స్పీకర్‌కు వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించాలని డీఎంకే ప్రయత్నిస్తున్న సమయంలో తనకు తిరునావుక్కరసు అనే వ్యక్తి ఫోన్ చేసి భారీగా ముడుపులు ఇస్తామని బేరసారాలు నడిపినట్లు కృష్ణగిరి జిల్లా ఊత్తాంగరై టీవీకే ఎమ్మెల్యే ఇళయరాజా పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

# భూ పోరాటంలో కవిత అరెస్ట్

**- పోలీసుల తీరుపై టీఆర్ఎస్ ఆగ్రహం**

**- బోడుప్పల్‌లో ఉద్రిక్తత.. పలువురు నాయకులు, కార్యకర్తల అదుపులోకి**

**- ఉద్యమకారులకు హామీలు అమలు చేయాలని డిమాండ్**



**హైదరాబాద్, జూలై 2**
తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో బోడుప్పల్‌లో చేపట్టిన భూ పోరాటం ఉద్రిక్తతకు దారితీసింది. టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా కవితతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు సమయంలో పోలీసుల తీరును నిరసిస్తూ టీఆర్ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భూ పోరాటం సందర్భంగా హెచ్ఎండీఏ భూముల్లో 'ఉద్యమకారుల రక్షణ కాలనీ' పేరుతో బోర్డు ఏర్పాటు చేసి, బొడ్రాయి ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. భూముల కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.అరెస్టు సమయంలో పోలీసులు తనతో దురుసుగా ప్రవర్తించారని కవిత ఆరోపించారు. తనను బలవంతంగా పోలీసు వాహనంలోకి ఎక్కించే క్రమంలో గాయాలయ్యాయని తెలిపారు. టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని, పలువురికి గాయాలయ్యాయని పార్టీ నాయకులు ఆరోపించారు. అనంతరం కవితను బొల్లారం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్ వద్ద టీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి. కవితను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కవిత, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే అరెస్టులు, నిర్బంధాలు చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. భూ పోరాటాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ముందస్తు నిర్బంధాలు చేపట్టారని టీఆర్ఎస్ ఆరోపించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నప్పటికీ వేలాది మంది ఉద్యమకారులు బోడుప్పల్‌కు చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపింది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఉద్యమాన్ని కొనసాగిస్తామని పార్టీ నాయకత్వం స్పష్టం చేసింది. ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయిస్తామన్న హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. హామీలు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ ఘటనతో బోడుప్పల్ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా, పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

# భద్రతలో కీలక మార్పులు

**- మాజీ డీజీపీలకు బుల్లెట్ ప్రూఫ్ వాహనాల తొలగింపు**

**- గన్‌మెన్, ఎస్కార్ట్ భద్రతలో కోత**

**హైదరాబాద్, జూలై 2**
తెలంగాణ పోలీస్ శాఖ భద్రతా ఏర్పాట్లలో కీలక మార్పులు చేపట్టింది. పదవీ విరమణ చేసిన ఉన్నతాధికారులు, ప్రస్తుతం వివిధ పదవుల్లో కొనసాగుతున్న కొందరు మాజీ డీజీపీలకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను ఉపసంహరించాలని నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం మేరకు మాజీ డీజీపీలతో పాటు కొందరు ప్రస్తుత పోలీసు ఉన్నతాధికారులకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కూడా వెనక్కి తీసుకుంటున్నారు. మాజీ డీజీపీలకు ఇప్పటివరకు కల్పిస్తున్న ఎస్కార్ట్ వాహనాలను సైతం ఉపసంహరించనున్నట్లు తెలిసింది. భద్రతా వనరులను అవసరానికి అనుగుణంగా వినియోగించడంలో భాగంగానే ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రభావం మాజీ డీజీపీలు స్వరజిత్ సేన్, ఏకే ఖాన్, ఏకే మహంతి, దినేష్ రెడ్డి, జితేందర్, మహేందర్ రెడ్డి, అనురాగ్ శర్మతో పాటు పలువురు మాజీ పోలీసు ఉన్నతాధికారులపై పడనున్నట్లు తెలుస్తోంది. అలాగే మరికొందరు సీనియర్ అధికారులకు కల్పిస్తున్న ప్రత్యేక భద్రతా సౌకర్యాల్లోనూ మార్పులు చోటుచేసుకోనున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయ పరిధిలో వినియోగిస్తున్న కొన్ని బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కూడా వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. అవసరాన్ని బట్టి మాత్రమే ప్రత్యేక భద్రతా వాహనాలను వినియోగించే విధంగా పోలీస్ శాఖ తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో పలువురు రాజకీయ నాయకులు, పోలీసు అధికారులకు కల్పిస్తున్న వ్యక్తిగత భద్రతలోనూ మార్పులు చేపట్టినట్లు సమాచారం. మొత్తం 31 మంది రాజకీయ నాయకులు, పోలీసు అధికారులకు కేటాయించిన గన్‌మెన్‌ల సంఖ్యను తగ్గించినట్లు తెలుస్తోంది. చాలామందికి ప్రస్తుతం ఒకరు వ్యక్తిగత భద్రతా సిబ్బంది, ఒకరు ఎస్కార్ట్ సిబ్బంది ఉండే విధంగా భద్రతను పరిమితం చేసినట్లు సమాచారం. అయితే ఈ మార్పులపై పోలీస్ శాఖ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. భద్రతా మదింపు, అవసరాల ఆధారంగానే ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తుండగా, తాజా చర్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# చర్చకు పిలిచి అడ్డుకోవడం ఎందుకు?: హరీశ్‌రావు

**- గన్‌పార్క్‌కు వెళ్లకుండా పోలీసులతో అడ్డుకున్నారని ఆరోపణ**

**- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శ**



**హైదరాబాద్, జూలై 2**
రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, చర్చకు పిలిచి మరోవైపు గన్‌పార్క్‌కు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు గన్‌పార్క్‌కు వెళ్లేందుకు ప్రయత్నించగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను రంగంలోకి దించి అడ్డుకుందని విమర్శించారు. ప్రభుత్వానికి నిజాలను ఎదుర్కొనే ధైర్యం లేకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. గన్‌పార్క్ వద్ద రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని హరీశ్‌రావు తెలిపారు. ఒకవైపు చర్చకు రమ్మని పిలిచి, మరోవైపు చర్చ జరిగే అవకాశాన్ని అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని వ్యాఖ్యానించారు.బీఆర్ఎస్ నాయకులు చర్చకు వస్తే ప్రభుత్వ అవినీతి, స్కాములు ప్రజల ముందుకు వస్తాయనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించిందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా చేయాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నారని విమర్శించారు. చర్చకు సిద్ధమని చెప్పిన ప్రభుత్వం తన మాటకు కట్టుబడి ఉండాల్సిందని అన్నారు. ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశాన్ని కూడా నిరాకరించడం సరికాదన్నారు. ప్రభుత్వం విమర్శలను స్వీకరించి ప్రజల ముందు సమాధానం చెప్పాలని సూచించారు.రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం బహిరంగ చర్చలు అవసరమని, అందుకు ప్రభుత్వం సహకరించాల్సిన బాధ్యత ఉందని హరీశ్‌రావు అన్నారు. పోలీసులను ఉపయోగించి ప్రతిపక్షాలను అణచివేయాలనే ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ముందు నిజాలు చెప్పేందుకు బీఆర్ఎస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలు విరమించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు తెలియజేయడమే తమ లక్ష్యమని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఆయన తెలిపారు.



## కుల బహిష్కరణ పేరుతో వేధింపులు.. పోలీసు రక్షణ కల్పించాలని దంపతుల విజ్ఞప్తి




**బెల్లంపల్లి మన సమాజం, జూలై 2:**
బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన పోలవేణి పవన్, మంజుల దంపతులు తమ కుటుంబాన్ని గత ఏడాదిన్నర కాలంగా కుల బహిష్కరణ పేరుతో సామాజికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తూ పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. గురువారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.తాము కర్ణ గొల్ల సామాజిక వర్గానికి చెందిన వారమని, కుల పెద్దలుగా వ్యవహరిస్తున్న పోలవేణి రాజం, కొమ్ము బీరయ్య, పోలవేణి మొండి తమ కుటుంబంపై ఏడాదిన్నర క్రితం కుల బహిష్కరణ విధించారని ఆరోపించారు. అంతేకాకుండా రూ.5 వేల జరిమానా విధించి చెల్లించాలని ఒత్తిడి తెచ్చారని తెలిపారు. తన తల్లిదండ్రులు పోలవేణి రాగులయ్య, భూమక్క కుటుంబ ఆస్తుల పంపకంలో తమకు 4.5 గుంటల భూమి వచ్చిందని, తన తమ్ముడు పోలవేణి రాజుకు వెళ్లేందుకు తమ భూమిలో 12 అడుగుల వెడల్పుతో దారి ఇవ్వాలని కుల పెద్దలు సూచించడంతో అంగీకరించామని చెప్పారు. అయితే అనంతరం మరో 1.5 అడుగుల భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, నిరాకరించడంతో బెదిరింపులు, మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.గత ఏడాదిన్నర కాలంగా తమను సామాజికంగా వెలివేసి, కులానికి సంబంధించిన కార్యక్రమాలకు దూరంగా ఉంచుతున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన "పస్కా పిల్ల" కార్యక్రమానికి కూడా తమను ఆహ్వానించలేదని, దీనిపై ప్రశ్నించగా పోలవేణి రాజం ఫోన్‌లో దుర్భాషలాడినట్లు ఆరోపించారు.ఇటీవల పోలవేణి రాజు ఇనుప రాడుతో దాడి చేసేందుకు ప్రయత్నించి, అదనపు భూమి ఇవ్వకపోతే చంపేస్తానని బెదిరించాడని పవన్ తెలిపారు. కుల పెద్దలు, తన తమ్ముడు కలిసి తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని, తమ ప్రాణాలకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తమ కుటుంబానికి పోలీసు రక్షణ కల్పించాలని దంపతులు విజ్ఞప్తి చేశారు.

## బిఎల్ఎలు కీలకపాత్ర పోషించాలి

**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్..**




**రామకృష్ణాపూర్, జూలై 2, (మన సమాజం):**
సర్ కార్యక్రమంలో బిఎల్ఎ లు కీలకపాత్ర పోషించాలని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ పై పట్టణంలోని బాల్క సుమన్ నివాసంలో నియోజకవర్గంలోని పార్టీ బిఎల్ఏ లకు బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర ఇంచార్జ్ సతీష్ గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ ప్రతి బూత్ లోని ఏజెంట్ బిఎల్ఓ లతో కలిసి సమన్వయంగా పనిచేయాలని సూచించారు. అలాగే బూత్ లెవల్ లో ఉన్న ప్రతి ఓటర్ వివరాలను సమర్థవంతంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఏజెంట్లతోపాటు పార్టీ శ్రేణులు ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, చెన్నూరు నియోజకవర్గం ఇంచార్జ్, మండల, పట్టణ అధ్యక్షులు సోషల్ మీడియా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## జులై 20లోపు నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలు

**న్యూఢిల్లీ, జూలై 2**
నీట్-యూజీ రీ-ఎగ్జామ్ ఫలితాలను జులై 20లోపు విడుదల చేయనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెల్లడించింది. ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసిన అనంతరం జూన్ 21న మళ్లీ పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ఎన్‌టీఏ సీనియర్ అధికారులు తెలిపారు. అయితే ఫలితాల విడుదలకు సంబంధించి ఖచ్చితమైన తేదీని మాత్రం ఇంకా ప్రకటించలేదు. రీ-ఎగ్జామ్ అనంతరం జూన్ 25న ఎన్‌టీఏ ప్రొవిజనల్ ఆన్సర్ కీని విడుదల చేసింది. అభ్యర్థులు తమ అభ్యంతరాలను జూన్ 28 వరకు నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దాదాపు 10 వేల అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి అభ్యంతరాన్ని నిపుణుల కమిటీ విడివిడిగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుందని తెలిపారు.ప్రతి ప్రశ్నపై అభ్యంతరం నమోదు చేయడానికి రూ.200 ఫీజు నిర్ణయించినట్లు ఎన్‌టీఏ పేర్కొంది. అభ్యర్థి చేసిన అభ్యంతరం సరైందని తేలితే చెల్లించిన ఫీజును తిరిగి చెల్లిస్తామని వెల్లడించింది. నిపుణుల పరిశీలన పూర్తైన అనంతరం తుది ఆన్సర్ కీని విడుదల చేసి, దాని ఆధారంగానే ఫలితాలను ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.



## ఒకే నెలలో మూడు సినిమాలు..
# కృతిశెట్టి మళ్లీ ట్రాక్‌పైకి వచ్చేనా..?

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. మరి చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

## హైప్ పెంచుతున్న మాస్టర్ మహేంద్రన్ వసుదేవసుతం టీజర్



దేవి సినిమాతో చైల్డ్ యాక్టర్‌గా సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు మాస్టర్ మహేంద్రన్. ఈ టాలెంటెడ్ యాక్టర్ హీరోగా నటిస్తున్న చిత్రం వసుదేవసుతం. వైకుంఠ్ బోను డైరెక్ట్ చేస్తున్నాడు. టాలీవుడ్ యాక్టర్ సత్యదేవ్ ఈ మూవీ టీజర్‌ను లాంచ్ చేశాడు. ఈ కథ ధర్మానికి అడ్డొస్తే మేనమామ అయినా.. లక్షల బంధుగణమైనా.. ఎదురుగా కోట్ల సాయుధులే ఉన్నా.. ధర్మ హింస తథైవచ అన్న శ్రీ కృష్ణుడిదే కాదు.. ధర్మాన్ని కాపాడేందుకు ఎంతటి మారణ హోమానికైనా ఎదురెళ్లే యువకుడిది అంటూ సాగుతున్న డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. గుడి, గుప్త నిధి చుట్టూ తిరిగే సస్పెన్స్ ఎలిమెంట్స్‌తో సినిమా సాగనున్నట్టు టీజర్‌తో హింట్ ఇచ్చేశాడు డైరెక్టర్. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, జాన్ విజయ్, మీమ్‌గోపి, తులసి, టార్జన్, రామరాజు, భద్రమ్, జబర్దస్త్ రాంప్రసాద్, శివన్నారాయణ, దువ్వాసి మోహన్, సుమేత బజాజ్, అంబికావాణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలువబోతున్నట్టు టీజర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ మూవీ రిలీజ్ డేట్‌పై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. ఈ చిత్రాన్ని రెయిన్‌బో సినిమాస్ బ్యానర్‌పై ధనలక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు.



# అన్నీ ఇక్కడే నేర్చుకున్నా!

'మనస్సినక్కరే' (2003) అనే మలయాళ చిత్రం ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది అగ్ర కథానాయిక నయనతార. ఆ తర్వాత తమిళ, తెలుగు భాషల్లో అగ్ర కథానాయికగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా 'చంద్రముఖి' 'గజిని' చిత్రాలు ఆమె కెరీర్‌ను మలుపుతిప్పాయి. ఇక అక్కడి నుంచి దక్షిణాదిలో అగ్ర నాయికగా చెలామణీ అయింది. అభిమానులు ఆమెను లేడీసూపర్‌స్టార్ అని ప్రేమగా పిలుస్తుంటారు. నయనతార ఇండస్ట్రీకి వచ్చి నేటితో 22 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఈ భామ అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ నోట్‌ను విడుదల చేసింది. 'నేను కెమెరా ముందుకొచ్చి 22ఏండ్లు గడచిపోయాయి. ఈ ప్రయాణం ఇంతదూరం సాగుతుందని అస్సలు ఊహించలేదు. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాతే వృత్తిపరంగా, వ్యక్తిగతంగా పరిణితి లభించింది. ఇక్కడే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. ఓ రకంగా సినీరంగం నాలో ధైర్యాన్ని నింపింది. నన్ను కొత్తగా పరిచయం చేసింది. ఈ ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికి కృతజ్ఞతలు' అని నయనతార పేర్కొంది.

# ఆ చాన్స్ వస్తే బాగుంటది!

'సాధారణంగా ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి అంటే ముక్కోణపు ప్రేమకథ అనుకుంటారు. కానీ ఈ సినిమాలో ఓ యూనిక్ పాయింట్ ఉంటుంది. అదేంటో ఇప్పుడే చెప్పకూడదు. సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పింది శ్రీనిధి శెట్టి. ఆమె సిద్ధు జొన్నలగడ్డ సరసన ఓ నాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసుకదా' ఈ నెల 17న విడుదలకానుంది. నీరజా కోన దర్శకురాలు. ఈ సందర్భంగా గురువారం పాత్రికేయులతో ముచ్చటించింది శ్రీనిధిశెట్టి. యాక్షన్, రక్తపాతం ఉన్న కేజీఎఫ్, హిట్-3 వంటి చిత్రాల తర్వాత ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ చేయడం సరికొత్త అనుభూతి అని చెప్పింది. ఈ సినిమాలో తాను రాగ అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్‌లో కొంచెం గ్రేషేడ్స్ కనిపిస్తాయని తెలిపింది. 'ఈ సినిమాలోని కొత్త పాయింట్ ప్రతీ ఒక్కరిని సర్‌ప్రైజ్ చేస్తుంది. లవ్, ఎమోషన్స్, కామెడీ.. ఇలా అన్ని అంశాల కలబోతగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది. సిద్ధు జొన్నలగడ్డకు సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌పై అవగాహన ఉంది. ఆయన టైమింగ్ బాగుంటుంది. ఇక రాశీఖన్నా క్రమశిక్షణ కలిగిన నటి. తన ఆహారపు అలవాట్లు, వర్కవుట్స్ అన్నీ పద్ధతిగా ఉంటాయి' అని శ్రీనిధి శెట్టి పేర్కొంది. వెంకటేష్-త్రివిక్రమ్ సినిమా కథానాయికగా ఎంపికయ్యారనే వార్తలపై స్పందిస్తూ 'నిజంగా ఆ విషయం నాకు తెలియదు. ఆ సినిమా ఛాన్స్ రావాలని కోరుకుంటున్నా.

